


# జవాబు తెలియనివాడు?

"అదేమిటే? ఏడున్నరకే సిద్ధమయ్యారు స్నానానికి మీరు. పిల్లలు ఆఫీసుల కెళ్ళాలా? ముందు వాళ్ళపని కానివ్వండి. మీరు తాపీగా తర్వాత చేద్దురుగానీ"

శ్రీమతి చిరు హెచ్చరికతోగాని తాను రిటైర్ అయ్యానన్న సంగతి గుర్తుకురాలేదు రామనాథానికి. అవును రిటైర్ అయినవాడికి తొందరేముంది. తీరిగ్గా అన్ని పనులు చేసుకోవచ్చు. కాని తన జీవన విధానం మార్చుకోవడం...

ముప్పయ్ అయిదు సంవత్సరాలుగా సాగిన విధానం... ఉదయం ఎనిమిదిన్నర గంటలకల్లా అన్ని పనులు ముగించుకొని, ఏ బస్సో పట్టుకుని, టంచనుగా పదిగంటలకు ఆఫీసులో అడుగుపెట్టడం తనకలవాటు.

నిజమే, ఇప్పుడు తాను పదిగంటలకు ఎక్కడికి వెళ్ళాలి? ఆలోచనలో పడ్డాడు రామనాథం. వాలు కుర్చీలో కూర్చుని ఆ రోజు దినపత్రిక అందుకున్నాడు. నల్లటి మబ్బుతునకల్లా ఏవేవో ఆలోచనలు కమ్ముకుంటు న్నాయి.

ఎన్ని ఒత్తిళ్ళు, ఎన్ని ప్రలోభాలు, ఎన్ని బెదిరింపులు, ఎందరి కోపాలు, ఎందరి శాపాలు... తాను బెదరలేదు. కొండలా చలనరహితంగా తన ధర్మాన్ని తాను మనసా వాచా కర్మణా నిర్వహించాడు. అందుకే ఏ ఉద్యోగంలో తాను చేరాడో రిటైర్ అయ్యేనాడు కూడా అదే ఉద్యోగంలో వున్నాడు. తనకంటే చాలా వెనకవచ్చిన వాళ్ళు కూడా తననుదాటేసి పైకి వెళ్ళిపోయారు.

"ఏమిటి రామనాథం ఈ అన్యాయం" అని ఎవరయినా అడిగితే సోక్రటీసులా నవ్వేవాడు.

తండ్రి యిచ్చిపోయిన ఇల్లు వుంది. తన సొంత పల్లెలో రెండెకరాల మాగాణి వుంది. చిన్న ఉద్యోగం వుంది. బ్రతకడానికి ఇంకేంకావాలి అన్నది రామనాథం మతం. ఉన్నంతలో పిల్లలకు చదువు చెప్పించాడు. ఇంజనీర్లను డాక్టర్లను చేయలేకపోయినా ఇద్దరూ గ్రాడ్యుయేట్స్ అయ్యారు.

పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై బ్యాంక్‌లో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. పెద్ద పెద్ద కోర్కెలు తీర్చకపోయినా తన శక్తికొద్దీ వారికి కావాల్సినవి తీర్చగలిగాడు.

ఇక తన కూతురు జానకిని పదో తరగతివరకూ చదివించాడు. ఎంత చదివినా కట్నాలు కానుకలు లేకుండా అమ్మాయిని పెళ్ళిచేసుకోవడానికి ఎవరూ ముందుకు రారు.

అందుకే తన ఆఫీసులోనే పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ రాఘవతో పెళ్ళిజరిపించాడు. అబ్బాయి బుద్ధిమంతుడు, చురుకైనవాడు. తన చిన్న నాటి స్నేహితుడి కుమారుడు. అభివృద్ధికి వచ్చే లక్షణాలు న్నాయి. జానికిని బాగా చూసుకుంటాడు. రామనాథ నమ్మకం వమ్మొకాలేదు. కూతురు అల్లుడు తన కళ్ళెదుటే కనుల విందుగా కాపురం చేసుకుంటున్నారు.

జానకి అంటే తనకెంతో యిష్టం. అమ్మాయి కూడా అంతే. నాన్నకు ఎలాంటి యిబ్బంది కలగకూడదని జాగ్రత్తపడుతుంది. జానకి ఏమీ అడగదు. 'మీ యిష్టం నాన్నా' అంటుంది ఏమడిగినా. తాను పెళ్ళి చేసి యిచ్చాడు. పదివేలు కట్నం, పదిసవర్ల బంగారం పెట్టాడు.

అంతే. చిట్టితల్లి నోరు తెరిచి యిదికావాలి, అది కావాలి అని అడగనేలేదు. అల్లుడు రాఘవ నా తల్లిని పువ్వుల్లోపెట్టి చూసుకుంటున్నాడు. అది తన అదృష్టంగా బావిస్తాడు రామనాథం. కూతురి ఆలోచనలతో నిండిపోయిన గుండెకు శ్రీమతి పిలుపు చురకలా తగిలింది.

స్నానం ముగించి, టిఫిన్ చేసి బట్టలేసుకున్నాడు రామనాథం. పిల్లలిద్దరూ ఆఫీసుకెళ్ళిపోయారు.

"ఎక్కడికి బయలుదేరారు" నారాయణమ్మ రాగం తీస్తున్నట్టు అడిగింది.

"అట్లా గ్రంథాలయం దాకా వెళ్ళివస్తాను. ఏదో విధంగా కాలక్షేపం చేయాలి గదా!"

"కాలక్షేపం చేయాలంటే మన సొంత పనులే కావాల్సి నన్ని వున్నాయ్, చిత్తూరు వెళ్ళిరండి. మా బాబాయ్ కూతురితో పెద్దాడి పెళ్ళి కుదుర్చుకురండి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది"

శ్రీమతి మాటలు వేడిగా తగిలాయి రామనాథం చెవులకు.

"రాజారావుతో సంబంధమా?" వొకింత చకితుడయ్యాడు రామనాథం.

"మా బాబాయికేం తక్కువ. పిల్లకూడా బికాం పాసయి ఉద్యోగం చేస్తుంది. అంతకన్నా గొప్ప సంబంధం మీరు తేగలరా?" భార్య ప్రశ్నకు సమాధానంలేదు రామనాథం దగ్గర.

పెద్దవాడి పెళ్ళి భార్య యిష్టప్రకారవే జరిగిపోయింది. నాన్న మనసు తెలిసిన జానకి రామనాథానికి ఓదార్పు మాటలు చెప్పగలిగింది. అమ్మ ఎప్పుడూ తన మాటే నెగ్గాలని చూస్తుంది. నాన్నకు కష్టం కలుగుతుందని చెప్పినా ఆమె వినదు.

ఆరు నెలలు తుఫాను ముందుప్రశాంతతలా గడిచిపోయింది. ఇంతలో రెండోవాడు తన ఆఫీసులో టైపిస్ట్ అమ్మాయిని పెళ్ళిచేసుకుని యింటి గుమ్మంలో నిలబడి "నాన్న! అమ్మా!" అని పిలిచాడు.

"సారీ నాన్నా! మీకు ముందే చెప్పలేకపోయాను, తప్పని పరిస్థితుల్లో యీ పెళ్ళి జరిగింది. క్షమించండి. అమ్మా! నన్ను... నన్ను..." నారాయణమ్మ రండి అని చెప్పి మరోమాటలేకుండా యింట్లోకి నడిచింది.

శ్రావణి మునిసుందరం

రోజులు గడుస్తున్నాయి. ఇంటినిండా నిశ్శబ్దం తాండవిస్తుంది. మూగమనుషుల్లా యంత్రాల్లా తమ పనులు తాము చేసుకుంటూ పోతున్నారందరూ.

ఒకనాడు చిన్నోడు తన అభిప్రాయం బయట పెట్టాడు. "మీ మూగతనం నన్ను బాధిస్తుంది. అందుకే నేను వేరే ఇల్లు చూసుకున్నాను. మీకు నా యింటికి వచ్చే స్వాతంత్ర్యం ఎప్పుడూ వుంటుంది. ఎంత చిన్న అవసరమొచ్చినా నాకు ఫోన్ చేయండి. నేను మీ దగ్గర వాల్తాను" అన్నాడు.మరో మూడు నెలలకు పెద్దాడు వాళ్ళ అత్తగారి ఊరికి ట్రాన్స్‌ఫర్ చేసుకుని వెళ్ళిపోయాడు.

చివరకు మిగిలింది ఇద్దరం. గట్టిగా నిట్టూర్చాడు రామనాథం. ఏమీ తోచదు. దినాలు యుగాలుగా గడుస్తూ ఉన్నాయి. ఏదయినా పనివుంటే... కొంత వెసులుబాటు మరచిపోవచ్చు. ఆలోచన వచ్చినదే తడవు రామనాథం ఉద్యోగాన్వేషణ మొదలుపెట్టాడు. ఎన్నో ప్రైవేట్ స్కూళ్ళు, కాలేజీలు, కంపెనీలు ఇటీవలి కాలంలో పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి యీ పట్నంలో.

ముప్పయ్ అయిదు ఏళ్ళుగా తానీ పట్నంలోనే వున్నాడు. ఒకరకంగా చూస్తే అందరికీ తాను పరిచితుడే. చిత్తశుద్ధితో, నిజాయితీగా, నమ్మకంగా నీతి తప్పక ఉద్యోగం చేసినవాడని కూడా అందరికీ తెలుసు. కాబట్టి ఉద్యోగం దొరక్కుండాపోతుందా అనుకున్నాడు రామనాథం. కానీ అతడికి ఉద్యోగం దొరకలేదు. సానుభూతి మాత్రం కడవలకొద్దీ లభించింది. ఆశ్చర్యపోయాడు. తనకెందుకు ఉద్యోగం దొరకడంలేదు. తనకెందుకు ఉద్యోగం యివ్వడానికి వెనకంజ వేస్తున్నారు? అర్థంకాలేదు. రిటైర్డ్ అయిన మర్నాడే ఒక ప్రైవెట్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన కృష్ణమూర్తిని ఒకరోజు అడిగాడు.

కృష్ణమూర్తి క్షణంసేపు మౌనం వహించి రామనాథం వైపు ఎగాదిగా చూశాడు. ఒక వెకిలి చిరునగవుతో "తప్పు నీదే రామనాథం" అన్నాడు. రామనాథానికి అర్థంకాలేదు.

"రామనాథం!" గీతలో కృష్ణుడు అర్జునుణ్ణి సంబోధించినట్టుంది. ఏమిటన్నట్టు చూశాడు రామనాథం.

"నువ్వు జీవితంలో ఒకే దారిలో నడిచావు. ఎన్నడూ రూట్ మార్చలేదు. నీ దారి నీకు నచ్చినది. అది అందరికీ నచ్చాలనీ లేదు. ఆ దారినే అందరూ నడవాలనీ లేదు. నీ దారి నీతి, నిజాయితీ, పద్ధతి, నమ్మకం, అది తప్పని ఎవరూ అనరు. ఈ దారిలో ప్రయాణంచేసి నువ్వు ఏమి సాధించావు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే వున్నట్లు జూనియర్ అసిస్టెంట్‌గానే మిగిలిపోయావు. కాలం మారింది. నువ్వు నడిచిన దారిలో నడవడానికి యిప్పుడు ఎవరూ సిద్ధంగాలేరు. అందుకే నీకు ఉద్యోగం యివ్వడానికి ప్రతి ఒక్కడూ భయపడుతున్నాడు" అన్నాడు.

ఏంచెప్పాలో తెలియని రామనాథంవిస్తుపోయి చూశాడు కృష్ణమూర్తిని.

"లౌక్యం కూడా కొంత అవసరమయ్యా బతకడానికి. పట్టువిడుపులు వుండాలి. మడిగట్టుకుని కూర్చుంటే యిలాగే వుంటుంది మరి బ్రతుకు. ఇప్పటికయినా మార్గం మార్చుకో" అన్నాడు క్రిష్ణమూర్తి.

నిశ్శబ్దంగా నిలబడ్డాడు రామనాథం.

"నువ్వు మనసు మార్చుకున్ననాడు నా దగ్గరికిరా ఉద్యోగం యిప్పిస్తాను" అంటూ వీపు తట్టి మరీ సాగిపోయాడు క్రిష్ణమూర్తి. నిర్విణ్ణుడయ్యాడు రామనాథం కొంతసేపు. నిబ్బరం తెచ్చుకుని రోడ్డుపక్కన వున్న చెట్టు నీడలో కూర్చున్నాడు.

తాను పయనించిన దారి తన అభివృద్ధికి అడ్డుపడిందా? ఆ దారే తనకిప్పుడు సైంధవుడిలా అడ్డుపడుతుందా? నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, జీవిత గమనానికి అడ్డుగోడలా? మరి యీ రూటు ఎందుకున్నట్టు? మెదడు మొద్దుబారిపోయినట్టయింది.రకరకాల శబ్దాలతో రకరకాల వాహనాలు రోడ్డును కసిగా తొక్కుతూ పరుగులు తీస్తున్నాయి. నీతి నిజా యితీలను కూడా కసిగా తొక్కుతూ నడుస్తూపోతున్నట్టు రామనాథానికి మనుషులు కనిపించారు.

*

## శిశిరం

కాసు కోసం
క్రోసు దూరం
వెడలి వచ్చిన విగతజీవి
కూలి లేక కూడు లేక
కూలబడిన బడుగు బ్రతుకు
శిశిర ఋతువై రాలిపోయెను
మోడు వారి కూలిపోయెను

## విత్తము - కవిత్వము

నాలోని భావాలు
నా అనుభవాలే
భూతవర్తమానంలో
తగిలిన గాయాలు
నేడు రూపం దాల్చి
నిలిచిన గేయాలు
కడలి అలల ఓలె
కడతేరని కష్టాలు
అక్షరమాలల అపురూప కవితలు
ఎన్నికి కోసమో ఎన్నో
నా ఆలోచనలు
ఎందరెందరి కోసమో
నా ఆవేదనలు
ప్రతిఫలం మాత్రం
అందని ద్రాక్షఫలాలు
ఐనా సరే!
ఆశ అవుసరం
పెంచుతున్నాయి ఓర్పును

## మహర్ జాతకం

ఎయిడ్స్ వధువుకి
నిరోధ్ వరునికి
జాతక చక్రాలు
జతపడలేదు

## కన్నీటి కాపురం

కృత్రిమ ప్రేమ
తాత్కాలిక బంధం
పెనవేసుకొన్నాయి
ఎయిడ్స్
కాపురం చేస్తోంది

సోమయాజుల సుబ్రహ్మణ్యశర్మ